**Andhra Jyothi**

# స్క్రీనింగే బెటర్

- ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహణ
- యూజీసీ రెగ్యులేషన్స్ ప్రకారమే జరగాలి
- కోరుకున్న వర్సిటీలకు మాత్రమే పరీక్ష
- తొలుత వర్సిటీల వారీగా నోటిఫికేషన్లు జారీ
- దరఖాస్తుదారులకే స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ
- వర్సిటీల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీపై వీసీల సమావేశంలో నిర్ణయం
- స్కైప్ ద్వారా మంత్రి గంటా సూచనలు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 'విశ్వవిద్యాలయాల ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడమే మంచిది. ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఇది జరగాలి. ఇందుకోసం ప్రత్యేకంగా కన్వీనర్‌ను నియమించాలి. స్క్రీనింగ్ నిర్వహించాలని కోరిన వర్సిటీలకే టెస్ట్ నిర్వహించాలి లేదా ఆయా వర్సిటీలే నిర్వహించుకోవచ్చు'... రాష్ట్రంలోని వర్సిటీల్లో ఫ్యాకల్టీ నియామక విధానాన్ని ఖరారు చేసేందుకు విజయవాడలో బుధవారం జరిగిన వీసీల సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలివి. రాష్ట్రంలోని 14 వర్సిటీల్లో తొలివిడతగా 1104 టీచర్ పోస్టులను 2016-17 విద్యా సంవత్సరంలో నియమించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఎల్.వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ పి.విజయ్‌ప్రకాశ్, ప్రొఫెసర్ పి.నరసింహారావు, కార్యదర్శి ఎస్.వరదరాజన్, సాంకేతిక విద్యా కమిషనర్ బి.ఉదయలక్ష్మి, వర్సిటీల వీసీలు తదితరులు పాల్గొన్నారు. ప్రాథమికంగా అభ్యర్థుల వడపోత ద్వారా సంఖ్యను కుదించేందుకు స్క్రీనింగ్ టెస్ట్ అవసరమని సమావేశం అభిప్రాయపడింది. మెరుగైన ఫ్యాకల్టీ నియామక ప్రక్రియలో భాగంగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాలని, ఆ తర్వాత పాత పద్ధతినే అనుసరించాలని వీసీలు అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రెగ్యులేషన్స్‌కు అనుగుణంగానే రిక్రూట్‌మెంట్ చేపట్టాలని స్పష్టం చేశారు. ఒక్కో యూనివర్సిటీలో ఒక్కో రకమైన డిపార్ట్‌మెంట్లు ఉండటం, వేర్వేరు రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నందున వర్సిటీల వారీగానే నియామకాలు పూర్తిచేయాల్సి ఉందని సమావేశం అభిప్రాయపడింది. తొలుత వర్సిటీల వారీగా టీచర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు జారీ చేయాలి. నిబంధనలకు అనుగుణంగా విద్యార్హతలు ఉన్న వారిని గుర్తించాలి. అర్హులైన అభ్యర్థులకు సబ్జెక్టుల వారీగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాలి. అందులో క్వాలిఫై అయిన అభ్యర్థుల జాబితాలను సంబంధిత యూనివర్సిటీలకు పంపాలి. ఒక్కో పోస్టుకు పది మంది చొప్పున అభ్యర్థులను వడపోత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. కాగా, విశాఖలో ఉన్న మంత్రి గంటా శ్రీనివాసరావు స్కైప్ ద్వారా అధికారులతో మాట్లాడారు. ఫ్యాకల్టీ నియామకాలకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందజేశారు.

### కాంట్రాక్ట్ లెక్చరర్ల ఆందోళన

వర్సిటీల్లో ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్‌కు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాలని నిర్ణయాన్ని వర్సిటీల్లో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వారు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)గా ఏర్పడి ఇప్పటికే స్క్రీనింగ్ టెస్ట్ వద్దంటూ వర్సిటీల బంద్ నిర్వహించారు. బుధవారం విజయవాడలో వీసీల భేటీ జరుగుతున్న గేట్‌వే హోటల్ ముందు నిరసన తెలిపారు. తాము కొన్ని ఏళ్ల నుంచి వర్సిటీల్లో పనిచేస్తున్నామని, ఇప్పుడు స్క్రీనింగ్ టెస్ట్ పెడితే తాము కొత్త అభ్యర్థులతో పోటీ పడలేమని వీసీలు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పాత పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలని కోరారు. స్క్రీనింగ్ టెస్ట్ యూజీసీ రెగ్యులేషన్స్‌కు విరుద్ధమని వారు తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్‌పై న్యాయపోరాటం తప్పదని వారు హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ పరిశీలనకు పంపిస్తామని ఉన్నత విద్యా మండలి చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి వారికి తెలియజేశారు.